


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 20 అక్టోబర్ 2025 పేజీలు 8




## ఏఐకి చిరునామాగా
# ఏపీని మార్చుతాం

- గూగుల్ రాకపై మూర్ఖుల విమర్శలను పట్టించుకోం
- జీఎస్టీ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.15వేలు ఆదా
- రాష్ట్రాన్ని పీడించిన రాక్షసుణ్ణి ప్రజలు ఓటుతో తరిమేశారు
- వైకుంఠపాళి వద్దు.. సుస్థిర పాలనతోనే అభివృద్ధి
- విజయవాడ పున్నమి ఘాట్ దీపావళి వేడుకల్లో సీఎం చంద్రబాబు చంద్రబాబు
- బీసెంట్ రోడ్‌లో చిరు, వీధి వ్యాపారులతో మాట్లాడిన సీఎం...

వివరాలు 2లో

### అంబాపురం డ్రైన్లలో
# ఎట్టకేలకు మురుగు తొలగింపు

- అధికారులకు స్థానికులు ఎకరువు పెట్టినా పట్టించుకోని వైనం
- పంచాయితీ కార్యదర్శి తీరుపై రుసరుస
- రంగంలోకి దిగిన సర్పంచ్ గండికోట సీతయ్య
- డ్రైన్లలో పూడికతీతపై కాస్త ఉపసమనం




**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** అంబాపురంలో దుర్గంధంపై నేటి దినపత్రిక సూర్యలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. పంచాయితీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పంచాయితీ సర్పంచ్ సీతయ్య రంగంలోకి దిగి కాల్వల్లో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవలనుంచి గత కొన్ని రోజులుగా కాల్వల్లో పేరుకుపోయిన మురుగుతో స్థానిక ప్రజలు అల్లాడిపోయారు. ప్రతి ఇంటిలో పెద్దవారు చిన్న పిల్లలు ఉండడంతో దోమల వ్యాప్తితో ఎటువంటి రోగం మిగతా 2లో...




# ఏఐకి చిరునామాగా ఏపీని మార్చుతాం




**విజయవాడ బ్యూరో, అక్టోబర్ 19, మేజర్ న్యూస్ :** విశాఖపట్నానికి గూగుల్ ఏఐ డాటా సెంటర్ రావడాన్ని జీర్ణించుకోలేని కొందరు మూర్ఖులు రాజకీయ కక్షతో అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని, అటువంటి వారి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏర్పాటు వల్ల 12 దేశాలకు సేవలు అందుతాయన్నారు. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల, విదేశాల్లో పెడుతున్న అతి పెద్ద పెట్టుబడి కూడా ఇదే కావడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ అభివృద్ధి వల్ల దేశంలో అత్యధిక తలసరి ఆదాయం అక్కడి నుంచే వస్తోందని, ఇప్పుడు ఏపీలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీని ఏఐకి చిరునామాగా మారుస్తామని స్పష్టం చేశారు. ఏఐ వల్ల రాబోయే పదేళ్లలో ఊహించని అభివృద్ధి రాష్ట్రంలో జరగుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలని... ప్రపంచంలోనే తెలివైన వారికి చిరునామాగా ఏపీ ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. అనాథ పిల్లలతో కలిసి క్రాకర్ షోను వీక్షించారు. అనంతరం సభను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

### రాక్షసుణ్ని ప్రజలు ఓటుతో తరిమేశారు

ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పట్టి పీడించిన రాక్షసుణ్ని ప్రజలు ఓటు ఆయుధంతో తరిమేశారని, ఎన్డీఏ కూటమిని 94 శాతం స్ట్రైక్ రేటుతో గెలిపించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం ఆక్సిజన్ అందించింది. రాష్ట్రంలో మళ్లీ వైకుంఠపాళి వద్దు. డబుల్ ఇంజన్ సర్కారుతో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందుతోంది. 2019–24 మధ్య ప్రజలెవరూ సంతోషంగా పండుగలే జరుపుకోలేదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్రజలంతా సుఖంగా ఉన్నారు. జీఎస్టీ సంస్కరణల ఉత్సవాలు దసరాతో ప్రారంభించి దీపావళి వరకూ నిర్వహిస్తున్నాం. సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. జీఎస్టీ వల్ల ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.15 వేలు ఆదా అవుతోంది. దీపావళి పండుగ ఒక సందేశం ఇస్తుంది. నరకాసురుడు సమాజాన్ని అతలాకుతలం చేస్తే శ్రీ కృష్ణుడు ఆ రాక్షసుణ్ణి వధించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాడు. అదే దీపావళిగా జరుపుకుంటున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నాం

'15 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాం. తల్లికి వందనం, పింఛన్లు, స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2 , అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం వంటి హామీలన్నీ అమలు చేశాం. ఎన్ని ఇబ్బందులున్నా ఉద్యోగులకు దీపావళి సందర్భంగా ఒక డీఏ ఇవ్వాలని నిర్ణయించాం. పోలీస్ సోదరులకు ఒక సరెండర్ లీవ్ ఇస్తున్నాం. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తున్నాం. 4వ తరగతి ఉద్యోగుల గౌరవం పెంచేలా రీ డిజిగ్నేట్ చేస్తాం. ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్య సహా ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తున్నాం. తెలుగుజాతి ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండాలని కోరుకుంటున్నాను. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 25 ఏళ్లు పూర్తిచేసుకున్నారు. మోదీ సారథ్యంలో మనదేశం 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుంది. 2047 నాటికి దేశంలోనే ఏపీ నెంబర్ వన్‌గా నిలుస్తుంది. 'అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పున్నమి ఘాట్‌లో నిర్వహించిన క్రాకర్ షోను అనాథ పిల్లలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు వీక్షించారు.

### బీసెంట్ రోడ్డులో సీఎం

దీపావళీ వేడుకలకు హాజరయ్యే ముందు బీసెంట్ రోడ్డులో సీఎం చంద్రబాబు పర్యటించారు. పలువురు చిరు, వీధి వ్యాపారులు, జనరల్ స్టోర్, చెప్పుల షాపు నిర్వాహకులతో మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా వస్తువుల ధరల తగ్గుదలను గురించి ఆయా వర్గాల వారిని అడిగి తెలుసుకున్నారు. చింతలపూడి దుర్గారావు అనే వీధి వ్యాపారితో సీఎం చంద్రబాబు మాట్లాడారు. తాను ప్రమిదలు, జ్యూట్ బ్యాగులు విక్రయిస్తానని తెలిపారు. ఆయనకున్న సమస్యలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. మరో వీధి వ్యాపారి యక్కలి బాలకృష్ణతో మాట్లాడారు. చదలవాడ వెంకటకృష్ణారావు అనే చెప్పుల షాపు యజమానితో మాట్లాడారు. వ్యాపారం నడుస్తున్న తీరు, చెప్పులపై జీఎస్టీ ఏ మేరకు తగ్గింది, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. బట్టల షాపునకు వెళ్లి అందులో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తోన్న గొడవర్తి లక్ష్మీ అనే మహిళతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అనంతరం కిరాణా షాపు వద్దకు వెళ్లి నిర్వాహకుడు బొడ్డు శ్రీనివాస్‌తో చంద్రబాబు ముచ్చటించారు. నిత్యవసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ఎంత వరకు ఉందని, ధరల వ్యత్యాసం గతానికి ఇప్పటికీ ఉన్న తేడా ఏ మేరకు ఉన్నాయనే అంశాన్ని సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసెంట్ రోడ్‌కు వచ్చిన పలువురు కొనుగోలు దారులనూ సీఎం పలకరించారు. వారితో ఫోటోలు దిగి ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.





# అంబాపురం డ్రైన్లలో ఎట్టకేలకు మురుగు తొలగింపు





(మొదటిపేజీ తరువాయి)

ప్రబలుతుందోనని తీవ్ర భయాందోళన చెందారు. నేటి దినపత్రిక సూర్య పంచాయితీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళినా నో యాక్షన్.. దరిమిలా కాంట్రాక్టర్ కూడా అందుబాటులోకి రాని పరిస్థితి...తీరా పంచాయితీ సర్పంచ్ సీతయ్య దృష్టికి తీసుకెళ్లగా అంబాపురం గ్రామంలోని కాల్వల్లో ఉన్న పళంగా పూడిక తీత పనులు చేపట్టాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ఆరకొర శానిటేషన్ సిబ్బంది కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టారు. అయితే కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులను చేపట్టాలని కోరుతున్నారు అంబాపురం వాసులు. అయితే పంచాయితీ కార్యదర్శి పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు అంబాపురం గ్రామస్థులు. ఒకటో వార్డులో చిన్న పాటి సమస్య వచ్చినా ఆఘమేఘాల మీద స్పందిస్తున్నారని కాని మేజర్ పంచాయితీ దుర్గంధంతో కూడిన సమస్యలు ఎదురైనా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రాత్రి కురిసిన వర్షానికి అంబాపురం ఒకటో వార్డు అతలాకుతలం

**తన సొంత ప్రొక్లైన్ తో రోడ్లపై నీటిని కాల్వలోకి మళ్ళించిన సర్పంచ్ సీతయ్య**

అర్ధరాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షానికి విజయవాడ రూరల్ మండలం అంబాపురం ఒకటో వార్డులో గల పార్క్ రోడ్డు, పలగాని రోడ్లో అత్యధికంగా నీరు రోడ్లపైకి చేరుకున్నాయి. అంబాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ గండికోట సీతయ్య కి స్థానికులు సమాచారం అందించగా తన సొంత ప్రొక్లైన్ ను స్వయంగా తీసుకొని వచ్చి రోడ్లపై ఉన్న నీటిని పక్కనే ఉన్న మురుగునీటి కాలవలోకి మళ్ళించారు. ఈ సమస్య పై అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి మరల ఇలాంటివి జరగకుండా చూసుకుంటానని చెప్పడంతో అక్కడున్న బాధితులు హర్షం వ్యక్తం చేశారు. అయితే వర్షం పడినప్పుడల్లా సమస్య పునరావృతం అవుతుందని అలా కాకుండా ఎమ్మెల్యే, ఎంపి దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలని స్థానికులు సర్పంచ్ ను కోరారు. తొందరలోనే ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకెళ్ళి పరిష్కారం చేపిస్తానని హామీ ఇచ్చారు సర్పంచ్ గండికోట సీతయ్య.






## సీఎం పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** దీపావళి సంధర్భంగా ఎన్.టి.ఆర్.జిల్లా గవర్నర్ పేట పోలీసు స్టేషన్ పరిదిలోని బీసెంట్ రోడ్డు ఏరియాలో, భవానిపురం పోలీసు స్టేషన్ పరిదిలోని పున్నమిఘాట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఆదివారం ఎన్.టి.ఆర్. జిల్లా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఇతర శాఖల అధికారులతో కలిసి గవర్నర్ పేట పోలీసు స్టేషన్ పరిదిలోని బీసెంట్ రోడ్డు ఏరియాలో, భవానిపురం పోలీసు స్టేషన్ పరిదిలోని పున్నమిఘాట్, పరిసర ప్రాంతాలను పరిశీలించి ఏర్పాటు చేస్తున్న బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందించారు. అనంతరం భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారి చేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అప్రమత్తంగా పటిష్టమైన బందోబస్త్ ఏర్పాట్లు, ఇతర ప్రయాణికులకు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇతర మార్గాలను నిర్దేశించే విధంగా, వాహనాల రద్దీ ఏర్పడకుం డా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... ఈ రోజు సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసెంట్ రోడ్డు ఏరియాలో పర్యటించి వ్యాపారస్తులతో మాట్లాడుతారు, అనంతరం పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన దివాళీ సంబరాలలో పాల్గొంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమంలో మంత్రులు, వి.ఐ.పి.లు, ఇతర అధికారులు పాల్గొంటారు. ఆయా పరిసర ప్రాంతాలలో, వి.వి.ఐ.పి. ప్రయాణించు మార్గాలలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని చేయు కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, పార్కింగ్ ప్రదేశాలు, పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. శ్రీఎస్.వి.డి. ప్రసాద్, ఏ.డి.సి.పి. జి.రామ కృష్ణ, ఏ.సి.పి.లు, ఇన్స్పెక్టర్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన బలిపీఠం ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా






**పామర్రు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని జమిగొల్వేపల్లి గ్రామంలో సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘంలో నూతనంగా ఏర్పాటుచేసిన బలిపీఠం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సదా దైవసేవలో రెవరెండ్ డాక్టర్ కె.ఏసుదాసు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రభువు సేవలో నిమగ్నమైన జేసుదాసు దంపతులను ఈ సందర్భంగా ఆయన అభినందించి సత్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బలిపీఠం ద్వారా దైవ సేవలో ప్రజలకు మరిన్ని మంచి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కె.కమలేషన్ బాబు, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తెదేపా నేత రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటు

## ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ నేత, ప్రముఖ న్యాయవాది లాయర్ పజ్జూరు రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలో ఆదివారం జరిగిన లాయర్ రామకృష్ణ దశదిన కర్మకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. పజ్జూరు రామకృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదిగా, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా, ఇటు తెలుగుదేశం పార్టీ నేతగా, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పజ్జూరు రామకృష్ణ ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఆయన మరణం తనను కలచివేసిందన్నారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ మరణం తీరని లోటు

## ఆయన జీవితం విద్యా ప్రచారం, మానవతా విలువలకు అంకితం : ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్. అబ్దుల్ అజీజ్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల ప్రఖ్యాత మతపండితుడు, జమియత్ ఉలేమా-ఎ-హింద్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ ఇక లేరని తెలిసి హృదయం కలిచివేసిందని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ మేరకు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ మరణం మతపరమైన, సామాజిక, విద్యా రంగాలకు తీరని లోటని అన్నారు. ఆయన జీవితం అంతా మత సేవ, విద్యా ప్రాచుర్యం, మానవతా విలువల ప్రోత్సాహానికి అంకితం అయిందని అన్నారు. శాంతి, సహనం, ఐక్యత వంటి విలువలను సమాజంలో వ్యాప్తి చేసిన గౌరవనీయ వ్యక్తి ఆయన అని పేర్కొన్నారు. ముస్లిం సమాజం కోసం నిస్వార్థంగా పనిచేసిన గొప్ప నాయకుడని అన్నారు. మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్‌తో తనకు వ్యక్తిగత అనుబంధం కూడా ఉందని, ఆయన సౌమ్యత, వినయం, సమాజం పట్ల ఉన్న నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. అల్లాహ్ తాలా ఆయన ఆత్మకు జన్నత్ అల్ ఫిర్దౌస్ లో ఉన్నత స్థానం ప్రసాదించాలని, ఆయన కుటుంబ సభ్యులకు, శిష్యులకు, అభిమానులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే ఓర్పు ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను అని తెలిపారు.

## రాష్ట్ర ప్రజానీకానికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. అంధకారంపై వెలుగు విజయం సాధించిన దీపావళి పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఐకమత్యం, సంతోషం నింపాలని ఆకాంక్షించారు. ఈ దీపావళి ప్రతి ఇంటికి వెలుగు మాత్రమే కాదు, ఆశ, అభివృద్ధి, సంక్షేమం కూడా తీసుకురావాలి. మన రాష్ట్రం మరోసారి వెలుగులా ప్రకాశించడానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, కూటమి ప్రభుత్వ కృషి పునాది అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ఈ ప్రభుత్వానికి ధ్యేయమని, ప్రతి నిర్ణయం ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రైతులు, యువత, మహిళలు, వృద్ధులు, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు చూపుతున్న నాయకత్వం వల్ల రాష్ట్రం మళ్లీ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. సాంకేతికత, విద్య, వ్యవసాయం, పరిశ్రమ, ప్రతి రంగంలో ఆవిష్కరణలతో ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు లభిస్తున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజల విశ్వాసం కూటమి ప్రభుత్వానికి బలమని, ప్రతి ఒక్కరి ఇంట్లో దీపాలు వెలిగేలా ఆర్థికాభివృద్ధి, అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులా మారాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండిపోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు

# వెలుగుల పండుగ దీపావళి

## ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలి

### దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రజలందరికీ దీపావళి పండుగ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఎంపి కేశినేని శివనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "తెలుగునేలపై నరకాసురుని ఏలుబడిలో ఇక్కట్ల పాలైనసమస్త ప్రజలు చీకటి పాలనకు స్వస్తి వాచకం పలికారు. అంధకారం తొలిగిపోయి..ఎన్డీయే కూటమి అధికారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో వెన్నెల వెలుగు తెలుగు లోగిళ్లలో ప్రసరిస్తుంది. రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తోంది. ఈ శుభ సమయంలో విచ్చేసిన.. దివ్య దీపావళికి స్వాగతం..సుస్వాగతం..వెలుగుల పండుగ దీపావళి - ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలి ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య, సురక్షితంగా... ఈ వెలుగుల పండుగను జరుపుకోవాలి . ఈ దీపాల పండుగ ప్రజల జీవితాల్లో సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు, తీసుకురావాలి. వాతావరణ కాలుష్యం పట్ల అప్రమత్తంగా ఉండి పర్యావరణాన్ని రక్షించుకుందాం" అని ఎంపి కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు.

## ఐడిబిఐ బ్యాంక్ నికర లాభం రూ. 3,627 కోట్లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఐడిబిఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికపు ఫలితాలను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికానికి నికర లాభం రూ. 3,627 కోట్లుగా ఉండగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 98 శాతం వృద్ధిని నమోదు చేసింది. నిర్వహణ లాభం రూ.3,523 కోట్లుగా ఉంది. ఎన్ఐఎం 3.71 శాతంగా నమోదు కాగా, నికర వడ్డీ ఆదాయం రూ.3,285 కోట్లుగా ఉంది. డిపాజిట్ ఖర్చు క్యూ2-2025కి 4.65 శాతంతో పోలిస్తే క్యూ2-2026కి 4.69 శాతంగా ఉంది. సీఆర్ఏఆర్ 341 బీపీఎస్ వార్షిక వృద్ధితో 25.39 శాతానికి మెరుగుపడింది. ఆస్తులపై రాబడి క్యూ2-2025కి 1.97 శాతంతో పోలిస్తే క్యూ2-2026కి 158 బీపీఎస్ పెరిగి 3.55 శాతంకి చేరుకుంది. ఈక్విటీపై రాబడి 29.64 శాతంగా ఉంది. సెప్టెంబరు 30, 2024 నాటికి 0.20 శాతం నుంచి నికర ఎన్పీఏ 0.21 శాతంకి చేరుకుంది. సెప్టెంబరు 30, 2024 నాటికి 3.68 శాతం నుంచి స్థూల ఎన్పీఏ 2.65 శాతానికి చేరుకుంది. సెప్టెంబరు 30, 2024 నాటికి 99.42 సారం నుంచి పీసీఆర్ 99.26 శాతానికి చేరుకుంది.

## తెదేపా సీనియర్ నేత, లాయర్ రామకృష్ణ దశదిన కర్మ లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు తెలుగుదేశం పార్టీ నేత, ప్రముఖ న్యాయవాది పజ్జూరు రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలో ఆదివారం జరిగిన లాయర్ రామకృష్ణ దశదిన కర్మకు తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు. పజ్జూరు రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఈ దశదిన కర్మ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు (నాని), మండల సీనియర్ నాయకులు పజ్జూరు రవి కుమార్ ( వెంకయ్య), లంక రామకృష్ణ వరప్రసాద్, తాడికొండ ఉమ, గుడిపూడి వెంకట్, ఎస్సీ సెల్ మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి ప్రకాష్, జి.కొండూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

## మధుమేహ రోగులకు ఉచిత వైద్యం



**గుడ్లవల్లేరు అక్టోబరు 19 మేజర్ న్యూస్:** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు (వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకష్ణ ఆర్థికసాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 120మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ పెరుమాళ్లు తెలిపారు. 15రోజులకు సరిపడా ఉచిత మందుల్ని రోగులకు పంపిణీ చేశారు. లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, మూల్పూరి సుధ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి వ్యక్తి సమాజ సేవలో బాధ్యత వహిస్తే సుభిక్షంగా సమాజం

**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రతి వ్యక్తి తమ ఇష్టమైన రంగం ద్వారా సమాజ సేవలో సాంఘిక బాధ్యత గా బాద్యులైతే సమాజం సుభిక్షంగా ఉంటుందని సంఘసేవకులు, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి మట్టా ప్రసాద్ పేర్కొన్నారు. గుడివాడలోని అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ 18వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా అమ్మ అవార్డును పామర్రు కు చెందిన రచయిత, జర్నలిస్ట్, సంఘ సేవకుడు పి.ఎం.ఎస్. ప్రసాద్ కు అమ్మ సంస్థ నేతలు మాటూరి రంగనాథ్, వల్లీ లు అందజేసారు. ఈ సందర్భంగా ప్రసాదును సన్మానం చేసి అవార్డును అందించారు. అవార్డును ప్రసాద్ అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని పామర్రు లయన్స్, మానవత, కళా పరిషత్ సంస్థలు పామర్రు లో అభినందనలు తెలిపి సత్కరించారు. ఎన్టీఆర్, పామర్తి వెంకట్ నారాయణ, మద్దిరాల ప్రభాకర్, చలసాని వెంకటరావు, సోమవరపు రామారావు, ఘంటసాల భరతుడు, రఘురామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసాద్ ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## పలువురిని పరామర్శించి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ఎమ్మెల్యే





**పామర్రు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామంలో పలువురిని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం పరామర్శించారు. రాయవరపు ప్రమీల ఇటీవల చికిత్స చేయించుకోగా ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 30,395 రూపాయల చెక్కును అందించి ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే అదే గ్రామానికి చెందిన తుమ్మపూడి రాజు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన గృహమునకు వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే కుమార్ రాజాతోపాటు స్థానిక పార్టీ నాయకులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో నూతక్కి పిచ్చేశ్వరరావు తండ్రి నూతక్కి శ్రీనివాసరావు అకాల మరణం చెందగా పామర్రు శాసనసభ్యులు ఆయన భౌతికకాయానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తోపాటు పామర్రు డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చోరగుడి క్లస్టర్ హైస్కూల్ కాంప్లెక్స్, ఐనపూరు హైస్కూల్‌లను

# ఆకస్మికంగా సందర్శించిన డైట్ లెక్చరర్



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** అంగలూరు ప్రభుత్వ డైట్ కళాశాల అధ్యాపకుడు చండిక వేణుగోపాలరావు ఉదయం ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను, మధ్యాహ్నం చోరగుడి క్లస్టర్ హైస్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఐనపూరు హైస్కూల్లో పాఠశాల రికార్డులను పరిశీలించి, పాఠశాల పనితీరును సమీక్షించారు. పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్నా భోజన పథక అమలు తీరును పర్యవేక్షించారు. వంట ఏజెన్సీ వారితో మాట్లాడుతూ విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. విద్యార్థులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన సలహాలను సూచనలు ఇచ్చారు. 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని తెలియజేశారు. తదుపరి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులకు వివరంగా తెలియజేశారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చోరగుడి క్లస్టర్ హైస్కూల్ లో జరిగిన కాంప్లెక్స్ సమావేశాన్ని ఆకస్మికంగా సందర్శించి, సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. హైస్కూల్ కాంప్లెక్స్ నిర్వహించడం వల్ల వచ్చే ఉపయోగాలు, వాటి లక్ష్యాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఉపాధ్యాయులందరూ ఒక సమూహంగా ఏర్పడి, ఏదైనా ఒక విషయంపై వివరంగా అందరూ చర్చించిన తరువాత, విషయంపై ఒక స్పష్టత వస్తుందని, సమస్యలకు ఒక గొప్ప పరిష్కారం లభిస్తుందని, తద్వారా విజ్ఞాన అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతమేరకు వాటికి పరిష్కారాలను సూచించారు. చోరగుడి క్లస్టర్ హైస్కూల్ కాంప్లెక్స్ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకముందు కూడా క్లస్టర్ సమావేశాలను ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక ప్రకారం అమలు చేస్తూ, మంచిగా నిర్వహించాలని కాంప్లెక్స్ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో చోరగుడి క్లస్టర్ హైస్కూల్ పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




### జోరువానలోనూ కొండలమ్మకు

# మొక్కుల చెల్లింపు


**గుడ్లవల్లేరు అక్టోబరు 19 మేజర్ న్యూస్:** జోరువానలో సైతం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి అత్యధిక మంది భక్తులు ఆదివారం తమ తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాల్ని స్వీకరించారు.



# దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లు శ్రీకాంత్, జోగి ఉద్యోగాన్ని అమ్ముకున్నారు

### బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వుయ్యూరు రమణ

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఉయ్యూరు రమణ ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పజ్జూరు శ్రీకాంత్ తొలిసారిగా వైన్ షాపులో అప్పట్లో ఉద్యోగం ఇప్పించింది ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్. అప్పట్లో నువ్వు వైన్ షాప్ లో ఉంటూ ఫ్రాడ్ చేయడం వల్ల ఎక్సైజ్ అధికారులు నీ ఉద్యోగాన్ని తొలగించారు. వైన్ షాపులో ఉంటూ నువ్వు అవినీతి, అక్రమాలకు పాల్పడటం వల్ల ఎక్సయిజ్ అధికారులు ఒకటికి రెండు,మూడు, నాలుగు సార్లు నిన్ను రెడ్ హ్యాండెడ్ గా మద్యం బెల్ట్ షాపులకు అమ్ముతుంటే పట్టుకొని అధికారులు నీ ఉద్యోగం తొలగించారు.నిన్ను కాపాడేందుకు ఏ అవకాశం లేక అంతటా మీడియాలో నీ ఫ్రాడ్ గురించి విచ్చలవిడిగా ప్రచారం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నీ ఉద్యోగం తొలగించారు తప్పితే ఇందులో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రమేయం ఏమి లేదు.ఇక షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం విషయానికి వస్తే అవినీతికి పాల్పడిన శ్రీకాంత్ అనే దొంగ మరో దొంగ జోగి రమేష్ వద్దకు వెళ్ళాడు. ఇక్కడ ఒక దొంగ మరో దొంగకు సపోర్ట్ చేశాడు.అవినీతి నాయకుడు జోగి రమేష్, అవినీతికి పాల్పడిన శ్రీకాంత్ అనే నీకు మద్దతు పలికాడు. దొంగలు, దొంగలు ఊళ్లు పంచుకున్నట్టు షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారు.ఎలాగైతేనే డబ్బులు తీసుకుని షిఫ్ట్ ఆపరేటర్ పోస్టు ఉద్యోగం అమ్ముకున్న మాట వాస్తవమని ఒప్పుకున్నందుకు థాంక్యూ..! ఉద్యోగం కోసం జోగి డబ్బులు గుంజిన విషయం ఎమ్మెల్యే కి చెప్పబట్టి, ఆయన కూడా దీనిపై చాలా సీరియస్ గా చర్యలు చేపట్టి తిరిగి డబ్బులు రికవరీ చేయించారు. ఈ క్రమంలో మాకు అండగా నిలబడ్డారు. ఆపై జోగి రమేష్ బాధితుడైన బడుగు సాయికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కృషితో, ఆయన ఆదేశాలు పాటిస్తూ వుయ్యూరు నరసింహారావు, పజ్జూరు వెంకయ్య గెయిల్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించారు.దేవుడి గుడిలో ప్రమాణాలు, తడిబట్టలు ఇవ్వన్నీ అనవసరం శ్రీకాంత్.ఇక్కడ ఒక ఎస్సీకి ఇచ్చిన ఉద్యోగాన్ని తీసేసి జోగి, నువ్వు కలిసి అమ్ముకున్నారు. ఆ ఉద్యోగాన్ని ఎవరైతే నష్టపోయారో తిరిగి అదే ఎస్సీ యువకునికి తిరిగి ఉద్యోగాన్ని ఎమ్మెల్యే ఇప్పించారు. ఆపై మీ బావమరిది బడుగు సాయికి కూడా డబ్బులు రిటర్న్ చేయించి, గెయిల్ లో ఉద్యోగం ఇప్పించి ఇద్దరికీ న్యాయం చేసిన ఘనత ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ది.మీ బావమరిదికి కూడా మా ఎమ్మెల్యే న్యాయం చేశారుఇదే అసలు వాస్తవం ఇదే నిజంఇకనైనా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పై తప్పుడు ప్రచారం మానుకోండి. దయచేసి గౌడ కులాన్ని అడ్డం పెట్టుకుని వాస్తవాలు సమాధి చేయవద్దు ఇది నా మనవి.



పేదల కోసం పదవీ త్యాగానికి సిద్ధపడిన

# మానవతా వాది స్వర్గీయ మండలి

## ప్రముఖ సినీ నిర్మాత ఘట్టమనేని



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమ ఉప్పెన అనంతరం బాధితులను, పేదలను ఆదుకునే క్రమంలో తన పదవిని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడిన మానవతావాది స్వర్గీయ మండలి వెంకటకృష్ణ రావు అని ప్రముఖ సినీ నిర్మాత, హీరో కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు అన్నారు. ఆదివారం తన బృందంతో దివిసీమ పర్యటనకు వచ్చిన ఆదిశేషగిరిరావును స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సాదరంగా స్వాగతం పలికారు..ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల సందర్భంగా వంతెన సెంటర్లోని కృష్ణారావు విగ్రహానికి ఆది శేషగిరిరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దివిసీమ ఉప్పెన బాధితులను ఆదుకోవటానికి అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రి మండలి వెంకట కృష్ణారావు తన పదవిని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడి, తనకు పదవుల కంటే, కష్టాల్లో ఉన్న తన ప్రజలకు ఆర్త జన బంధువుగా నిలవటమే ముఖ్యమని స్పష్టం చేసి, ఉప్పెన బాధితుల కన్నీరు తుడిచి అభాగ్యులకు అండగా నిలిచిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన సమయంలో ముందుగా స్పందించిన సూపర్ స్టార్ కృష్ణ గొప్ప మానవతావాది అని అన్నారు. ఆది శేషగిరిరావు అన్నకు తగిన తమ్ముడిగా రామ లక్ష్మణుల్లా ఉండే వారన్నారు. తమ కుటుంబంతో హీరో కృష్ణ అత్యంత సన్నిహితంగా ఉండటమే కాకుండా మండలి వెంకట కృష్ణారావు చేపట్టే కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషించే వారన్నారు. 1975లో మండలి వెంకట కృష్ణారావు ప్రపంచ ప్రథమ తెలుగు మహాసభలను దిగ్విజయంగా నిర్వహించటం ద్వారా తెలుగు ప్రజల నడుమ సమైక్యతను, సుహృద్భావాన్ని పెంపొందించేందుకు చేసిన కృషిలో హీరో కృష్ణ భాగస్వాములై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి నిధులు సేకరించి సమకూర్చటంలో ప్రముఖ పాత్ర వహించారని స్మరించుకున్నారు. 1977 మే నెలలో అవనిగడ్డలో కృష్ణారావు ఏర్పాటు చేసిన రాష్ట్ర నాటకోత్సవాలకు తన సతీమణి విజయనిర్మలతో కలిసి వచ్చారని తెలిపారు. 1977 నవంబర్ 19న సంభవించిన దివిసీమ ఉప్పెన బాధితులను చూసి కృష్ణ చలించిపోయారని తెలిపారు. పెను విషాదం నుంచి దివిసీమ ప్రజలను కాపాడేందుకు మండలి వెంకట కృష్ణారావు చేపట్టిన విస్తృత సహాయక చర్యలు, దివిసీమ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో హీరో కృష్ణ భాగస్వాములయ్యారని తెలిపారు. దివిసీమను సందర్శించి రూ.పదివేల విరాళం ప్రకటించడంతోపాటు, రూ.లక్ష విలువచేసే నిత్యవసర వస్తువులు ఉప్పెన బాధితులకు అందజేశారని తెలిపారు. అంతేకాకుండా ఒక సంవత్సరం పాటు తనకు వచ్చే ఆదాయంలో పది శాతం తుఫాను బాధితులకు అందజేసిన దయార్ద్ర హృదయులు హీరో కృష్ణ అని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. దీంతోపాటు హీరో కృష్ణ తాను నటించిన ఊరికి మొనగాడు సినిమాలో దివిసీమ ఉప్పెన బీభత్సాన్ని, బాధితుల కష్టాలను ప్రపంచానికి తెలిసేలా సుప్రసిద్ధ సినీ పాటల కవి వేటూరి సుందర రామమూర్తితో పాట రాయించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకుల దృష్టికి దివిసీమకు వచ్చిన కష్టాన్ని చూపించి సహాయక చర్యలు మరింత విస్తృతంగా జరిగేందుకు కృషి చేశారని తెలిపారు. ఈ విధంగా కృష్ణ కుటుంబంతో తమకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆదిశేష గిరిరావును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలి వెంక ట్రామ్, శీలం అశ్విన్ కుమార్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్య క్షులు యాసం చిట్టిబాబు, కూటమి నాయకులు, మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.



వసంత కృష్ణ ప్రసాద్ గురించి మాట్లాడే

# నైతిక అర్హత జోగి రమేష్‌కి లేదు

## దొండపాటి విజయ్ కుమార్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** గత పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం వ్యవహారం గురించి మాట్లాడే నైతిక అర్హత జోగి రమేష్ కి లేదని మైలవరం మండలం కీర్తిరాయునిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ దొండపాటి విజయ్ కుమార్ ఆరోపించారు. కల్తీ మద్యం వ్యాపారంతో జీవనాన్ని కొనసాగించిన మీరు కృష్ణ ప్రసాద్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని, వసంత కృష్ణ ప్రసాద్ కి రాజకీయ బిక్ష పెట్టామని మీడియా ముఖంగా జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయని,మీ చిన్నతనంలోనే వసంత కుటుంబం రాజకీయంగా ఉందని, 2009 లో నువ్వు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తే 1999 లోనే వసంత కృష్ణ ప్రసాద్ నందిగామ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారని తెలియజేశారు. రాజకీయంగా వసంత కృష్ణ ప్రసాద్ ని ఎదుర్కొనే దమ్ము లేక కులం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. 2029లో వసంత కృష్ణ ప్రసాద్ తనకు ప్రత్యర్థిగా ఉండాలని జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయని, ముందు 2029లో నీకు ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేపిస్తున్నారో మీ నాయకుడిని అడిగి తెలుసుకో. మైలవరం పెడన మైలవరం పెడన పెనమలూరు ఇలా ఏ స్థాన చలనం లేకుండా పోటీ చేసే మీరా మా నాయకుడి గురించి మాట్లాడేది అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



## శ్రీ వెంకటేశ్వరుని దర్శనానికి భక్తుల తాకిడి

**గుడ్లవల్లేరు అక్టోబరు 19 మేజర్ న్యూస్:** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి అధికమైంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ





**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వేరువేరు గ్రామాల్లో ముఖ్య మంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కుమార్ రాజా ఆదివారం స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. గరికపర్రు గ్రామంలో యరగాని గుణప్రియ కు 20,464 రూపాయలు, అలాగే యాకమూరు గ్రామంలో మొట్టికాయల రాధాకృష్ణ కు 41,870 రూపాయల మంజూరైన ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లు వీరపనేని శివరాం ప్రసాద్ జనసేన మండల పార్టీ అధ్యక్షులు శనివారపు కృష్ణ సుమన్, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన టీడీపీ నగర అధ్యక్షుడు స్వామి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక 13వ డివిజన్ లో నీ పుట్టి అనసూయకి ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ జరగగా సుమారు 1,80,000 రూపాయిలు ఖర్చు అవ్వగా ఆ విషయం 13వ డివిజన్ ఇంచార్జ్,పట్టణ అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామికి తెలియగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లగా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 60,000 రూపాయలు చెక్కు ద్వారా సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు,13వ డివిజన్ ఇంచార్జ్ లోగిశెట్టి వెంకటస్వామి 13వ డివిజన్ టీడీపీ ప్రెసిడెంట్ సీనియర్ నాయకులు దేవనబోయిన రాధా, జనరల్ సెక్రెటరీ ఐ.రాజశేఖర్, సెక్రెటరీ యార్లగడ్డ ఆనంద్,సెక్రెటరీ పిన్నింటి సుబ్రమణ్యం,దంపనబోయిన లక్ష్మణ,అవురు ప్రసాద్ పాల్గొన్నారు.

## సెయింట్ జాన్స్ డైరెక్టర్ సాబుజాన్‌కు అప్స అవార్డు



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్ సాబుజాన్ కు ఏ. పి. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి. సుబ్రమణ్య రాజు అప్స ఎక్సలెన్సి ఇన్ లీడర్షిప్ అవార్డును అంద చేసారు. విద్యారంగానికి, అసోసియేషన్ కు అయన చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డు లభించి నట్లు సాబుజాన్ తెలియజేసారు. అవార్డు పొందిన సాబుజాన్ ను పెడన నియోజకవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం. జనార్దన రావు, రాష్ట్ర నాయకులు వి. సుందరరామ్, టి. సింహాచలం,అప్స రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, పాఠశాల ప్రిన్సిపాల్ జాన్సీ సాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## జీఎస్టీ సంస్కరణలతో మన దేశ ఉత్పత్తులకు

# ప్రపంచ స్థాయి మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయి







### జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు ఒక వరం

### సూపర్ జీఎస్టీ తో దేశంలో పెరిగిన వస్తువుల అమ్మకాలు

### సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అవగాహనలో భాగంగా బైక్ ర్యాలీ లో పాల్గొన్న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ, అక్టోబర్ 19, మేజర్ న్యూస్ :** జీఎస్టీ సంస్కరణలు కారణంగా మన దేశ ఉత్పత్తులకు ప్రపంచ స్థాయి మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నూజివీడు పట్టణంలో ఉత్సాహపూరిత వాతావరణంలో పెద్ద ఎత్తున జరిగిన బైక్ ర్యాలీ లో మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను స్వయంగా బైక్ ని నడుపుతూ ప్రజలను మరింత ఉత్సాహ పరిచారు. బైక్ ర్యాలీ నూజివీడు జంక్షన్ రోడ్డులోని పోతిరెడ్డిపల్లి టర్నింగ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం నుండి ప్రారంభమై చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున సాగింది. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ్యలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు ఒక వరమని, ప్రజల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చాయన్నారు. ప్రజలకు మేలు జరిగేలా, ప్రజల జీవనవిధానం మెరుగుపడి, ఆర్థికంగా అభివృద్ధితో సంతోషంగా ఉండాలన్నది ఆశయంతో జీఎస్టీ స్లాబులను గణనీయంగా తగ్గించాయన్నారు. జీఎస్టీ సంస్కరణలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయలలో నష్టం వచ్చినప్పటికీ, ప్రజలలో కొనుగోలు శక్తి ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాయన్నారు. జీఎస్టీ సంస్కరణల కనరణంగా మనం ఇంట్లో వినియోగించే నిత్యావసర వస్తువులైనా పాలు నుండి వాహనాలు, రైతులు సాగుకు వినియోగించే వస్తువులు, టాక్టర్లు వంటి యంత్ర పరికరాలు, భారీ వాహనాలు లక్షల రూపాయలలో తగ్గాయన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ముడిసరుకులు ధరలు తగ్గి, వస్తువులు తయారీ తగ్గడంతో మన దేశ ఉత్పత్తులు తక్కువధరలకే నాణ్యమైన వస్తువులు లభించడంతో ప్రపంచ స్థాయిలో మన ఉత్పత్తులకు మరింత గిరాకీ పెరిగి మార్కెటింగ్ సౌకర్యాలు మరింత పెరుగుతాయన్నారు. ఔషదాలపై 5 శాతానికి జీఎస్టీ తగ్గించడం, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు వాడే ఔషదాలపై జీఎస్టీని పూర్తిగా మినహాయించడంతో వాటిని వినియోగించేవారి ఎంతో స్వాంతన కలుగుతుందన్నారు. అంతేకాక జీవిత, ప్రమాద, ఆరోగ్య భీమాల ప్రీమియంలపై జీఎస్టీ ని పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. వీటిని ప్రజలందరూ పూర్తిగా తెలుసుకునేలా, జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతీ కుటుంబానికి అందేలా, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వాటిపై ప్రజలకు మరింత అవగాహన కలిగించేందుకు గత నెల రోజుల నుండి వివిధ అంశాలపై గ్రామ/వార్డ్ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పై జిల్లాలోని 7 లక్షల కుటుంబాలకు ప్రతీ ఇంటికి వెళ్లి అవగాహన కలిగించడం జరిగిందన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ను ప్రజలందరూ సద్వినియోగం చేస్తుకుంటున్నారని, నెలరోజుల్లోనే షుమారు లక్ష కోట్ల రూపాయలకు పైగా అమ్మకాలు పెరిగాయన్నారు. పాత జీఎస్టీ ధరలకు వస్తువులను అమ్మే వారిని ప్రజలు ప్రశ్నించాలని, వారిపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు, జీఎస్టీ ఫలాలు ప్రతీ కుటుంబానికి అందాలన్న లక్ష్యంతో నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జీఎస్టీ సంస్కరణలతో అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గడంతోపాటు ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరుగుతుందన్నారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎం. శ్రీహరి, నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కో ఆప్షన్ మెంబెర్ సిహెచ్. దుర్గ ప్రసాద్, నియోజకవర్గంలోని మండల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, టిడిపి పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షులు జగదీశ్, ప్రముఖులు వాసు, ప్రభు, ఆది, ఇళయరాజా, ప్రసాద్, వేణు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ..



**విజయవాడ, అక్టోబర్ 19, మేజర్ న్యూస్ :** జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు... సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ దీపావళి విజయానికి ప్రతీక అని మంత్రి నారాయణ పేర్కొన్నారు..ప్రజలందరి జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు ప్రసరించాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. టపాసుల వెలుగులతో, దీప కాంతుల జ్యోతులతో, సిరసంపద రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని కోరుకుంటున్నానన్నారు.. కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.ప్రజల చీకట్లను చెరిపేసే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లని పారద్రోలినట్లుగా.. ఒక్కొక్క మార్పు సాధించుకుం టూ బంగారు భవిష్యత్ ను నిర్మించుకుందామని సూచిం చారు. అష్టలక్ష్ములు ప్రతి ఇంట్లో నెలవై సకల శుభాలను, ధైర్యాన్ని, స్థైర్యాన్ని, విజయాలను, సిరి సంపదలను, సుఖ సంతోషాలను ప్రసాదించాలని, తెలుగింటి లోగిళ్లన్నీ దీప కాంతులతో వెలుగులీనాలని, ఈ దీపావళి మీ జీవితంలో వెలుగులు నింపాలని, సరికొత్త వెలుగులతో ప్రజల జీవితాలు మరింత ప్రకాశించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.






### ఇన్ఫెక్షన్ సోకిన చిన్నారులను పరామర్శించిన జిల్లా వైద్య శాఖ అధికారి సుహాసిని

#### గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి

**పెనుగంచిప్రోలు ,అక్టోబర్ 19 మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు గ్రామంలోని వైరల్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న చిన్నారులను. డి .ఎం .హెచ్. వో సుహాసిని ఆదివారం పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు, ఇన్ఫెక్షన్ సోకిన చిన్నారులను విజయవాడ తరలించి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అలాగే వారితోపాటు పెనుగంచిప్రో లు మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి గ్రామంలో తిరుగు తూ వీధి వీధికి వాడ వాడకు ప్రతి ఒక్కరిని గడపకు వెళ్లి ఆరోగ్య సమస్యలుతెలుసుకున్నారు .గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ వీదులలో జరుగుతున్న ప్రత్యేక శానిటేషన్ బ్లీసింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యాం కుమార్, డాక్టర్ నాగరాణి, ఏఎన్ ఎంలు ఆశ వర్కర్ లు ప్రభుత్వ వైద్య సిబ్బంది స్థానిక వైద్య సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.



### నరకోత్తారక క్షేత్రంలో నరకాసుర వధ కార్యక్రమం

#### శ్రీపృథ్వీశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** మహిమాన్విత శైవక్షేత్రం, నరకాసురునికి మోక్షం ప్రసాదించిన చల్లపల్లి మండలం నడకుదురు శ్రీపృథ్వీశ్వరక్షేత్రంలో నరక చతుర్దశిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నరకాసుర వధ కార్యక్రమం జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విజయలక్ష్మి దంపతులు, యువనేత మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్వీన్కుమార్ కృష్ణప్రభలు దేవాలయాన్ని దర్శించుకుని శ్రీపృథ్వీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ప్రత్యేకంగా తయారుచేసిన నరకాసురుని బొమ్మను నిప్పుతో వెలుగుతున్న బాణం వదిలి నరకాసుర వధ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్కుమార్, సొసైటీ చైర్మన్లు పెద్దిబోయిన హరినాధ్, గుత్తికొండ వంశీకృష్ణ, నేతలు మల్లు పెద్ది త్రివిక్రమరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, వడ్లమూడి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసు, ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి నరకాసుర వధ కార్యక్రమం తిలకించారు.

# కృష్ణాజిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు

## ప్రమాదాలకు తావులేని, ప్రశాంతమైన వాతావరణంలో దీపావళి పండుగ జరుపుకోవాలి..

### జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రమాదాలకు తావులేని ప్రశాంతమైన వాతావరణం మధ్యలో కుటుంబ సభ్యులందరి సమక్షంలో ఆనందభరితంగా ఈ దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, కృష్ణాజిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలను, సంతోషాలను, కొత్త కాంతులను తీసుకురావాలని, అలాగే దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు.చిన్న పిల్లలతో టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్త వహిస్తూ, తల్లిదండ్రులు లేదా పెద్ద వారి పర్యవేక్షణలో వారు ఉండేలా చూడాలని తెలిపారు.అధిక శబ్దం కలిగిన బాణసంచాను కాల్చే సమయంలో తోటి వారికి ఇబ్బంది కలగకుండా బంధుమిత్రులు,కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందంగా జరుపుకోవాలి.ఎటువంటి అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని సూచించారు.అనధికారికంగా బాణ సంచా నిల్వలు కలిగి ఉండటం వలన ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. కనుక అలాంటి సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని అన్నారు.మందు గుండు సామాను, బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ పద్ధతులను అవలంబించాలని, దుకాణ యజమానులు నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి.ప్రతి ఒక్కరం బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చు. ప్రమాదాలు లేని దీపావళి జరుపుకోవడానికి ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి తెలియజేశారు.




## పామర్రు స్టేషన్ తనిఖీ చేసిన డిఎస్పీ ధీరజ్ వినీల్

**పామర్రు మేజర్ న్యూస్ :** వార్షిక తనిఖీలో భాగంగా పామర్రు పోలీస్ స్టేషన్ ను గుడివాడ డి.ఎస్.పి.వి. ధీరజ్ వినీల్ తనిఖీ చేసారు. తొలుత స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన స్టేషన్ ఆవరణలో కొన్ని కేసుల్లో దొరికిన వాహనాలను కోర్టుకు అప్పగించాలని సూచించారు. అనంతరం పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. బీట్ వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఫైల్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత పామర్రు సిఐ వి.శుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్‌లు డీఎస్పీ ధీరజ్ వినీల్‌కు స్వాగతం పలికారు.

## వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా గుంజ శ్రీనివాసు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సిఫార్సుల మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. నూతన అధికార ప్రతినిధిగా నియమితులైన శ్రీనివాసును పార్టీ పట్టణ నేతలు, కార్యకర్తలు అభినందించారు.

# విద్యార్థులకు విద్యా వస్తువులు బహుకరణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 143 మంది విద్యార్థులకు దాతలు దొడ్డా పూర్ణచంద్రరావు, ఆయన కుమారులు పరమేశ్వర నాగ వెంకటేశ్వర లాల్, సూర్య వెంకట ప్రసాద్, లక్ష్మి లోకేష్, శ్యామల పలు విద్యా వస్తువులను అందజేశారు. విద్యార్థులకు అవసరమైన ప్యాడ్ లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, దస్తర్లు, చాక్ పీసులు, పెన్సిల్ బాక్స్ లు తదితర విద్యా వస్తువులు బహుకరించారు. ఈసందర్భంగా దాత దొడ్డా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ విద్యా వస్తువులను సక్రమంగా వినియోగించుకుని, మంచిగా విద్యాబుద్ధులు నేర్చుకుని, జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. దాతలు లాల్, ప్రసాద్, లోకేష్, శ్యామల మాట్లాడుతూ చదువుకోవడానికి పేదరికం వల్ల విద్యార్థులు ఎవరూ కూడా ఇబ్బందులు పడకూడదనే మంచి ఉద్దేశంతో విద్యార్థులందరికీ ఈ విద్యా వస్తువులు బహుకరించడం జరిగిందని తెలియజేశారు. ఈసందర్భంగా ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కుటుంబం అందరూ కలిసి ప్రధాన దాత దొడ్డా పూర్ణచంద్రరావును శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ, పెద్ద మనసుతో దాతలు పాఠశాల విద్యార్థులకు విద్యా వస్తువులను అందించటం హర్షించదగ్గ విషయం అన్నారు. పాఠశాల విద్యా కుటుంబం అందరి తరపున దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాత దొడ్డా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యా వస్తువులను గతంలో మాదిరిగా ప్రతి సంవత్సరం ఇక ముందు కూడా బహుకరిస్తామని, విద్యార్థులందరూ ఈఅవకాశాన్ని మంచిగా వినియోగించుకుని, గొప్ప లక్ష్యంతో కృషిచేసి, మీరు పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన అంగలూరు ప్రభుత్వ డైట్ కళాశాల తెలుగు ఉపన్యాసకులు చండిక వేణుగోపాలరావు మాట్లాడుతూ దాతలు గొప్ప దాతృత్వంతో పాఠశాల విద్యార్థులకు విద్యా వస్తువులు సమకూర్చటం శుభపరిణామం అని, దాతల యొక్క కృషిని విద్యార్థులందరూ అర్థం చేసుకుని, బాగా చదువుకుని గొప్ప స్థాయికి ఎదిగినప్పుడే, దాతల యొక్క లక్ష్యాన్ని నెరవేర్చినట్లు అవుతుందని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కృష్ణాజిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ దీపావళి ప్రజల జీవితాల్లో అజ్ఞానపు చీకట్లను తొలగించి, సంతోషపు వెలుగులు నింపాలని, ప్రభుత్వ పథకాల లబ్ధి పొంది శుభం చేకూర్చాలని కోరుకుంటూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు దీపావళిశుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చీకటిని తరిమికొట్టి వెలుగులను నింపే ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని, ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య సురక్షితంగా వెలుగుల పండుగ జరుపుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటూ రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర, జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయండి : ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రులో నూతనంగా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రం (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) భవన నిర్మాణ పనులను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరిశీలించారు. ఈ భవన నిర్మాణాలను ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన గుత్తేదారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 6కోట్ల రూపాయల వ్యయంతో ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను చేపట్టినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కైలే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చాగంటిపాడు గ్రామంలో డొక్కు సాంబశివరావు కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకలలో పామర్రు మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్‌తో పాటు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999